సాక్షి తిరుపతి

శనివారం । 9 । సెప్టెంబర్ । 2023



వైభవంగా వరలక్ష్మీ వ్రతం

సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయంలో శుక్రవారం వైభవంగా వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. - IIలో



ఘనంగా గోకులాష్టమి వేడుకలు

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఘనంగా గోకులాష్టమి వేడుకలు నిర్వహించారు. - IIలో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	36	26
చిత్తూరు	36	25
తిరుమల	32	22
గూడూరు	37	27
నగరి	37	26

న్యూస్‌రీల్

నేడు అయోధ్యకాండ అఖండ పారాయణం

తిరుమల : లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై శనివారం మూడో విడత అయోధ్యకాండ అఖండ పారాయణం నిర్వహించనున్నారు. అయోధ్యకాండలోని 9 నుంచి 11వ సర్గల వరకు 139 శ్లోకాలను పారాయణం చేయనున్నారు. అలాగే యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంతో 25 శ్లోకాల పారాయణం చేపట్టనున్నారు. ఎస్వీ వేద వి/్జాన పీఠం, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, టీటీడీ వేదపండితులు, సంభావన పండితులు, అన్నమాచార్య ప్రాజెక్ట్, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం పండితులు పాల్గొననున్నారు. ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది.

67 మందికి ఉద్యోగాలు



నియామకపత్రం అందిస్తున్న కంపెనీ ప్రతినిధులు

గూడూరురూరల్ : పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ మినీ జాబ్‌మేళా నిర్వహించింది. మేనకూరు సెజ్‌లోని గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, శ్రీసిటీలోని హీరో మోటోకార్ప్, ఏజీటీఆర్ఎస్, కృష్ణపట్నం పోర్టుకి సంబంధించిన కంపెనీల హెచ్ఆర్ ప్రతినిధులు హాజరయ్యారు. 146 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి 67 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపల్ జి.శ్రీరాములు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో దుకాణాల తనిఖీ

తిరుపతి అర్బన్ : తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే వస్తువులు విక్రయించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఆ మేరకు డీపీటీఓ చెంగల్ రెడ్డి ఆదేశాల మేరకు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు నేతృత్వంలో శుక్రవారం బస్టాండ్‌లోని దుకాణాలను తనిఖీ చేశారు. ప్రధానంగా ఎమ్మార్పీ ధరలకే వస్తువులు విక్రయిస్తున్నారా...కేటాయించిన స్థలంలోనే వ్యాపారం చేస్తున్నారా...ప్రయాణికులతో గౌరవంగా మాట్లాడుతున్నారా...అనే అంశాలను ఆరా తీశారు. ఆర్టీసీ నిబంధనల మేరకే వ్యాపారం చేసుకోవాలని స్పష్టం చేశారు. అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

26 దుకాణాల టెండర్లు రద్దు

తిరుపతి అర్బన్ : తిరుపతి బస్టాండ్‌లో ఈ నెల 13వ తేదీన నిర్వహించాల్సిన దుకాణాల టెండర్ల ప్రక్రియను రద్దు చేశారు. మొత్తం 56 షాపులకు ఆగస్టు 25వ తేదీన టెండర్లను ఆహ్వానించారు. వీటిలో 1 నుంచి 26 వరకు దుకాణాల టెండర్లను రద్దు చేశామని, మిగిలిన 30 షాపులకు యథావిధిగా ప్రక్రియ జరుగుతుందని ఆర్టీసీ జిల్లా పర్సనల్ అధికారి పార్థసారధి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

తిరుచ్చిపై అలమేలు మంగమ్మ



తిరుచ్చిపై దర్శనమిస్తున్న అమ్మవారు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఆలయంలోని శ్రీకృష్ణ ముఖమండపం వద్దకు వేంచేపు చేసి, పాంచరాత్ర ఆగమోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం విద్యుద్దీపాల నడుమ అమ్మవారికి ఊంజల్‌సేవ చేపట్టారు. అనంతరం తిరుచ్చి వాహనంపై ఆశీనులైన అమ్మవారు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈక్రమంలోనే శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని ఆలయ ఎదుట వేడుకగా ఉట్లోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్లు శేషగిరి, మధు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు శుక్రవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్‌కు 36 బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. చిత్తూరులో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని కొత్త జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు అదాలత్ ప్రారంభవుతుందన్నారు. లోక్ అదాలత్ విజయవంతానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు, వివిధ శాఖల అధికారులు కృషి చేయాలని ఆయన తెలిపారు.



జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థులు

ఉద్యోగమస్తు

యువతకు ఉద్యోగావకాశం అందించాలి.. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు చేయాలి.. పేద కుటుంబాల్లో సైతం వెలుగులు నింపాలి.. ఇదే లక్ష్యంతో నేదురుమల్లి ఫౌండేషన్ వారు శుక్రవారం వెంకటగిరిలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. బహుళజాతి కంపెనీల ప్రతినిధులతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన అభ్యర్థుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఎంపికైన వారికి నియమాకపత్రాలు అందించేందుకు సన్నాహాలు చేపట్టారు. మిగిలిన వారికి సైతం ఉపాధి కల్పించనున్నట్లు భరోసా ఇచ్చారు.

- నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా
- 2,122 మంది అభ్యర్థులు హాజరు
- ఇంటర్వ్యూలు నిర్వహించిన 49 కంపెనీల ప్రతినిధులు
- 1,500 మందికి పైగా ఎంపిక
- త్వరలోనే నియామకపత్రాలు అందిస్తామన్న రామ్‌కుమార్‌రెడ్డి



టీమ్‌లీజ్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్ : యువతీయువకులకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎన్‌జేఆర్ భవనంలో టీమ్‌లీజ్ కంపెనీ సహకారంతో నిర్వహించిన జాబ్ మేళా విజయవంతమైంది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన మేళాకు వెంకటగిరి, బాలాయపల్లె, డక్కిలి, రాపూరు, సైదాపురం, కలువాయి మండలాలతోపాటు, గూడూరు, నాయుడుపేట, శ్రీకాళహస్తి రూరల్ మండలాల నుంచి మొత్తం 2,122 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. ఇంటర్వ్యూలకు తరలి వచ్చిన అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా ప్రత్యేక కౌంటర్లు, హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. పోలీసులు పకడ్బందీ బందోబస్తు కల్పించారు. అభ్యర్థులు, వారి సహాయకులకు తాగునీరు, భోజన వసతి కల్పించారు. ఇక 49 ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేపట్టారు. సుమారు 1,500 మందికి పైగా అభ్యర్థులను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం నియమాకపత్రాలు అందించనున్నట్లు వెల్లడించారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నేదురుమల్లి ఫౌండేషన్, టీమ్‌లీజ్ కంపెనీ తరఫున యువతకు అండగా అండగా ఉంటామన్నారు. జాబ్‌మేళాకు ఆన్‌లైన్‌లో 3వేలకు పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. అయితే 2,122 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు చెప్పారు. టీమ్‌లీజ్ అనుసంధానంలో 2,005 కంపెనీలు ఉన్నాయని వివరించారు. ఇంటర్వ్యూల్లో ఎంపిక కాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి మరో అవకాశం కల్పించనున్నట్లు భరోసా ఇచ్చారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని హాజరు కాని వారికి త్వరలో మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, పార్టీ జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు కాల్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, న్యాయవాది ఎల్.కోటేశ్వరరావు, సదా రెడ్డి, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.



అభ్యర్థుల వివరాలు నమోదు చేసుకుంటున్న వివిధ కంపెనీల ప్రతినిధులు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీల ప్రతినిధులు

సంతోషంగా ఉంది



పోస్టు గ్రాడ్యుయేషన్‌లో మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ కోర్సు పూర్తి చేశా. చదువుకు తగ్గ ఉద్యోగం దొరకక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నా. నేదురుమల్లి ఫౌండేషన్ వారు ఏర్పాటు చేసిన జాబ్‌మేళాకు హాజరయ్యా. ప్రముఖ కంపెనీ ఇంటర్వ్యూ చేసింది. ఉద్యోగానికి ఎంపికవుతాననే నమ్మకం రావడంతో సంతోషంగా ఉంది.

– కిరణ్మయి, రాణిపేట, వెంకటగిరి

కల నెరవేరుతోంది



నేను డిప్లమో ఈఈఈ పూర్తిచేశా. సరైన ఉద్యోగం రాక చాలా కాలం నుంచి ఖాళీగా ఉంటున్నా. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జాబ్‌మేళాకు హాజరయ్యా. ఇంటర్వ్యూను చక్కగా అటెండ్ చేశా. సోమవారం కాల్ లెటర్ పంపిస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఇన్నాళ్లకు నా కల నెరవేరుతోంది.

– వి.శ్రీనివాసులు, మందరిళ్లు, వెంకటగిరి

నిరుద్యోగులకు ఉపాధి



నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాతో ఎందరో నిరుద్యోగులకు ఉపాధి దొరకనుంది. సంతోషిస్తున్నాం జాబ్‌మేళాలో ఇంటర్వ్యూ అయిన తర్వాత ఉద్యోగం వస్తుందనే నమ్మకం ఏర్పడింది.

– నిన్న నరసింహులు, కాంపాళెం, వెంకటగిరి

నేడు ఎస్వీయూలో గురుపూజోత్సవం

తిరుపతి రూరల్ : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేతులు మీదుగా ఏటా గురువులను సత్కరించటం ఆనవాయితీ. చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే అధ్యాపకులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఘనంగా సత్కరించనున్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి నిర్వహించనున్న గురుపూజోత్సవానికి ఈ ఏడాది తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం వేదికవుతోంది. వర్సిటీ ఆవరణలోని శ్రీనివాస ఆడిటోరియంలో శనివారం నిర్వహించే గురుపూజోత్సవానికి నియోజకవర్గంలోని దాదాపు 1,800 మంది ఉపాధ్యాయులు హాజరు కానున్నారు. వీరందరికీ ఎమ్మెల్యే చెవిరెడ్డి స్వయంగా నూతన వస్త్రాలు అందించి గౌరవించనున్నారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డి ముఖ్య అతిథిగా రానున్నారు. చంద్రగిరి నియోజక వర్గ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో పనిచేసే గురువులందరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి విజ్ఞప్తి చేశారు.



ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

కురిపించు..మురిపించు!



'వర్షాలు సమృద్ధిగా కురవాలి. పంటలు బాగా పండాలి. రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలి. ప్రజలందరికీ మంచి జరగాలి' అని శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శుక్రవారం ఆగమోక్తంగా వరుణయాగం ప్రారంభమైంది. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ.ధర్మారెడ్డి కలిసి అర్చకులకు పసుపు వస్త్రాలను బహూకరించారు.

– చంద్రగిరి

సమస్యల పరిష్కారానికి 'చెబుదాం'

చిల్లకూరు (చిట్టమూరు) : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతిష్టాత్మకంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ బాలాజీ తెలిపారు. శుక్రవారం చిట్టమూరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 'జగనన్నకు చెబుదాం' ప్రారంభించారు. జేసీ మాట్లాడుతూ ఎలాంటి సమస్యలైనా సత్వరం పరిష్కరించేందుకు బాధితులు టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి చెప్పుకోవచ్చన్నారు. బ్రిటిష్ హయాంలో తయారు చేసిన భూ రికార్డులను ప్రక్షాళన చేసేందుకు జగనన్న భూ రక్ష- భూ హక్కు పథకం కింద పకడ్బందీగా సర్వే చేస్తున్నట్లు వెల్లడించారు.

దీంతో భవిష్యత్‌లో భూ ఆక్రమణలకు తావు ఉండదన్నారు. ఇకపై స్పందన కార్యక్రమాన్ని వారంలో రెండు రోజులపాటు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కలెక్టరేట్‌లో మాత్రం ప్రతి సోమవారం స్పందన ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి జిల్లాలో చిట్టమూరు నుంచి శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందని తెలిపారు. పేదల గుండె చప్పుడుగా జగనన్న మారారని వెల్లడించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతి ఒక్కరి మదిలో గుర్తుండిపోయారని కొనియాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని చిన్నారులతో మామయ్యా అని ఆప్యాయంగా పిలిపించుకుంటున్నారని చెప్పారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా జగనన్న సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. నిషేధిత జాబితాలోని వేలాది ఎకరాలకు విముక్తి కల్పించి పేదలకు పట్టాలు అందించారని తెలిపారు. రైతులకు అండగా నిలిచేందుకే భూరక్ష పథకం చేపట్టారని వెల్లడించారు.గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీకి రసీదు ఇవ్వడం తోపాటు సమస్యను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. తర్వాత సమస్య పరిష్కారమయ్యే వరకు అర్జీదారుడి ఫోన్‌కు సమాచారం వస్తుంటుందని వెల్లడించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిప్పల వెంకటయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు దువ్వూరు శేషురెడ్డి, మేరుగల మధుయాదవ్, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ షాలేట్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, వేదికపై జేసీ బాలాజీ, ఆర్డీఓ కిరణ్‌కుమార్ తదితరులు

'చెదిరిన' పొదరిల్లు

అదొక సామాన్య కుటుంబం. ఉన్నంతలో ఆనందంగా జీవితాన్ని గడుపుతూ భర్తకు చేదోడుగా ఉండే భార్య, ముద్దులొలికే ఇద్దరు బిడ్డలు. ఎన్నో ఆశలతో కట్టుకున్న ఇల్లు. అందరూ ఈర్ష్యపడేలా జీవిస్తూ వచ్చిన ఆ కుటుంబం రోడ్డు ప్రమాదంలో అసువులు బాసింది. ఇంటి నుంచి ఆనందంగా బైక్‌పై బయలుదేరిన వారు మళ్లీ విగతజీవులుగా రావడం స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. మరోవైపు బతుకుదెరువు కోసం జాతీయ రహదారిపై వైట్ మార్కింగ్‌లు వేసే పనిని ఎంచుకున్న తండ్రీ, కొడుకుల సంపాదనే ఆ కుటుంబానికి ఆధారం. రోడ్డు ప్రమాదంలో తండ్రి చనిపోగా కొడుకు పరిస్థితి విషమంగా ఉంది. ఇలా ఓ ప్రమాదం రెండు కుటుంబాలను విషాదంలోకి నెట్టేసింది.

- రక్తసిక్తమైన ధర్మాపురం రహదారి
- ఒకే కుటుంబంలో నలుగురు మృతి
- మిట్టపాళెం గ్రామంలో విషాదఛాయలు
- మరో కుటుంబంలో యజమాని దుర్మరణం
- క్షతగాత్రులు నలుగురు రుయాకు తరలింపు



భూపాలన్ ఇంటి వద్ద విషాదం (ఇన్‌సెట్) భూపాల్, నీలావతి, పుట్టిన రోజు వేడుకల్లో నితిన్, ఉమేష్(ఫైల్)

నగరి : మున్సిపల్ పరిధి ధర్మాపురం వద్ద జాతీయ రహదారి శుక్రవారం ఉదయం రక్తసిక్తమైంది. ఏక కాలంలో నాలుగు వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో వాహనాల్లో ప్రయాణించేవారు చెల్లాచెదురై రోడ్డుకు ఇరువైపులా ఎగిరిపడ్డారు. అకస్మాత్తుగా ఈ సంఘటన జరగడంతో వెనుకవైపున వస్తున్న వాహనాల్లో వచ్చేవారు ఉలిక్కిపడ్డారు. రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతిచెందగా, నలుగురు తీవ్రగాయాల పాలయ్యారు. సీఐ సురేష్ కథనం మేరకు.. ధర్మాపురం వద్ద జాతీయ రహదారి సిబ్బంది తమ టాటాఏస్ వాహనాన్ని రోడ్డుపై ఉంచి నిర్వహణ పనుల నిమిత్తం జనరేటర్ మరమ్మతులు చేస్తుండగా తిరుపతి నుంచి చెన్నైకి వెళుతున్న సిమెంటు లారీ అదుపు తప్పి టాటాఏస్ వాహనాన్ని వేగంగా ఢీకొంది. అదేసమయంలో నగరి నుంచి పుత్తూరు వైపుగా వస్తున్న కారును, బైకును కూడా ఢీకొంది. ఏక కాలంలో నాలుగు వాహనాలు ప్రమాదానికి గురికావడంతో తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఉమేష్ (3) సంఘటన స్థలంలోనే దుర్మరణం చెందారు. మిగిలిన వారిని ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మిట్టపాళెం గ్రామానికి చెందిన భూపాలన్ (29), నితిన్ (4), తమిళనాడు వేలూరుకు చెందిన కన్నన్ (50) మృతిచెందారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన తిరునావుక్కరసు (32), విల్లుపురానికి చెందిన మణికంఠన్ (23), హరికృష్ణ (21), అలందూర్‌పేటకు చెందిన దినేష్ (18), మిట్టపాళెంకు చెందిన నీలావతి (26)ని తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నీలావతి మృతిచెందగా, తిరునావుక్కరసు పరిస్థితి విషమంగా ఉంది.

మంత్రి ఆర్కేరోజా దిగ్భ్రాంతి

మండలంలోని మిట్టపాళెం గ్రామంలో ఒకే కుటుంబంలో నలుగురు మృతిచెందడంతో మంత్రి ఆర్కేరోజా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన సంతాపాన్ని తెలియజేశారు.



భూపాల్ నూతనంగా నిర్మించుకున్న ఇల్లు

పుట్టింటికి చేరుకోకనే..


భూపాల్ కుటుంబం వారం కిందటే కొత్తింటిలో చేరింది. పిల్లల పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. భూపాలన్ భార్య నీలావతి పుట్టింటికి వెళ్లాలని కోరడంతో పిల్లలు ఇద్దరినీ, భార్యను తీసుకుని పుత్తూరు మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి బైక్‌లో బయలుదేరాడు. మార్గమధ్యంలో మృత్యువు లారీ రూపంలో వారిని కాటేసింది. కాగా భూపాలన్‌కు తల్లి, అవ్వ, తమ్ముడు ఉన్నారు.

బతుకు తెరువుకు వచ్చి

తమిళనాడు వేలూరుకు చెందిన తండ్రీ కొడుకులు కన్నన్ (50), తిరునావుక్కరసు (32) బతుకు బండిని నడిపేందుకు జాతీయరహదారి పనులకు వెళుతున్నారు. పేద కుటుంబం కావడంతో వీరిద్దరి సంపాదనపైనే కుటుంబం ఆధారపడి ఉంది. రోడ్డుపై మార్కింగ్ వేసే పనులను ఉపాధిగా ఎంచుకున్నారు. ప్రమాదంలో తండ్రి కన్నన్ మృతిచెందగా, తిరునావుక్కరసు పరిస్థితి విషమంగా ఉంది.

కన్నతండ్రి 'మూగ'రోదన

మిట్టపాళెంలో కుమార్తె నీలావతి ఇంటి వద్దే ఉన్న ఆమె తండ్రి మునస్వామి వీరి వెంటే మరో ద్విచక్ర వాహనంలో తన స్వగ్రామం వేణుగోపాలపురానికి బయలు దేరాడు. అతను వెనుకవైపు వస్తుండగా ముందువైపు ఈ ప్రమాదం చోటు చేసుకుంది. తన కళ్లముందే కుమార్తె, అల్లుడు, మనవళ్లు రక్తసిక్తమై పడివుండడం చూసి చలించిపోయాడు. తన వివరాలు చెప్పి ఎవరినైనా పిలుద్దామన్నా పుట్టుకతో మూగవాడు కావడంతో ఎవరికీ సమాచారం అందించలేక అయినవాళ్లను చూస్తూ ఆర్తనాదాలు పెట్టాడు. కాగా నీలావతి తల్లి చిన్నతనంలోనే టపాకాయల పేలుళ్లలో చనిపోయింది. పినతల్లి పెంపకంలోనే పెరిగింది. ఆమెకు ఇద్దరు సంతానం ఉన్నారు.



ప్రమాద స్థలంలో నితిన్, ఉమేష్, భూపాల్

హుటాహుటిన చేరుకున్న యంత్రాంగం

ప్రమాదం జరిగిన సంగతి తెలిసిన వెంటనే డీఎస్పీ రవికుమార్, ఆర్డీవో సుజన, సీఐ సురేష్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. అంబులెన్స్‌ల ద్వారా క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా కమిటీ ఎంపిక



మాట్లాడుతున్న కేవీ చౌదరి

తిరుపతి కల్చరల్ : చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా నూతన కమిటీ ఎంపిక చేశారు. శుక్రవారం నాయుడుపేట ఓ కన్వెన్షన్ హాల్లో కమిటీ ఎన్నిక చేపట్టారు. చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడిగా కేవీ చౌదరి, కార్యదర్శిగా కె.రఘురామిరెడ్డి, కోశాధికారిగా కేవీ ప్రసాద్‌తోపాటు కార్యవర్గసభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీకి తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్ కుమార్ రాజు అభినందనలు తెలిపారు.

అడవిలో తవ్వితే పీడీ యాక్ట్



స్వాధీనం చేసుకున్న ప్రొక్లెయిన్‌తో అటవీశాఖ సిబ్బంది

సైదాపురం : అడవిలో ఖనిజ సంపద కోసం తవ్వకాలు సాగిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని నెల్లూరు డీఎఫ్‌ఓ ఆవుల చంద్రశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం సైదాపురంలో ఆయన మాట్లాడుతూ గులించెర్ల అటవీ ప్రాంతంలో నెల్లూరు రేంజర్ మాల్యాద్రి నేతృత్వంలో తనిఖీలు చేపట్టి ప్రొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు చేపట్టిన దాడుల్లో 4జేసీబీలు, ఓ ప్రొక్లెయిన్, టిప్పర్, ట్రాక్టర్ సీజ్ చేసినట్లు వివరించారు.

ఇంటింటికీ వైద్యసేవలు

- చంద్రగిరి ఆదర్శంగా.. 'జగనన్న ఆరోగ్య సురక్ష'కార్యక్రమం
- నిర్వహణపై రాష్ట్ర వైద్య విభాగం జోనల్ సమావేశంలో చర్చ



ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అశోక్‌కుమార్‌రెడ్డి తదితరులు

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గం ఆదర్శంగా రాష్ట్ర ప్రభుత్వం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్య విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఇంటింటికీ వైద్య సేవలు అందించే దిశగా ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుపతి రూరల్ పరిధిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో తిరుపతి, నెల్లూరు, చిత్తూరు జిల్లాల వైద్య విభాగం సభ్యులు సమావేశమయ్యారు. ముఖ్యఅతిథులుగా వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల రాష్ట్ర కో–కన్వీనర్, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి అశోక్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. చంద్రగిరి నియోజకర్గంలో చేపట్టిన ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహణ విషయమై చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వివరించారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని వివరించారు. కరోనా తరువాత ఉత్పన్నమవుతున్న ఆరోగ్య సమస్యలను అధిగమించేందుకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరిగిన మెడికల్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని మోహిత్‌రెడ్డి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేసే అవకాశం ఉంటుందని ఇరువురూ అభిప్రాయం వ్యక్తం చేశారు. అక్టోబర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ఉచిత మెడికల్ క్యాంప్‌లను నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా వైద్యవిభాగం అధ్యక్షుడు డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మహేంద్రనాథ్ రెడ్డి, కార్పొరేషన్ అధ్యక్షుడు డాక్టర్ నారాయణ రెడ్డి, అధికార ప్రతినిధి డాక్టర్ ఆనంద్‌రెడ్డి, తిరుపతి, నెల్లూరు చిత్తూరు వైద్యవిభాగం డాక్టర్లు జనార్ధన్ రాజు, వరప్రసాద్, చంద్రశేఖర్‌రెడ్డి, గణేష్ కుమార్‌రెడ్డి, మహేంద్రనాథ్‌రెడ్డి, చందన పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల భద్రతపై సీవీఎస్వో, ఎస్పీ సమీక్ష



మాట్లాడుతున్న టీటీడీ సీవీఎస్వో నరసింహ కిషోర్, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుమల: తిరుమలలో సెప్టెంబర్ 18 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబరు 15 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న నవరాత్రి బ్రహ్మోత్సవాల భద్రత ఏర్పాట్లపై టీటీడీ సీవీఎస్వో నరసింహ కిషోర్, తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి శుక్రవారం సాయంత్రం తిరుమల అన్నమయ్య భవనంలో పోలీసు, విజిలెన్స్ అధికారులతో సమీక్షించారు.

బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం రోజున ముఖ్యమంత్రి పర్యటన, గరుడ సేవ, రథోత్సవం, చక్రస్నానం వంటి విశేషమైన రోజుల్లో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భద్రతా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పార్కింగ్ ప్రదేశాలకు సూచిక బోర్డులు, అదనపు పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో తిరుమల అదనపు ఎస్పీ మునిరామయ్య, ఎస్టేట్ విభాగం ప్రత్యేకాధికారి మల్లికార్జున, అన్నప్రసాదం ప్రత్యేకాధికారి శాస్త్రి, డెప్యూటీ ఈవో భాస్కర్, వీజీవోలు బాలిరెడ్డి, గిరిధర్ రావు, నందకిషోర్ పాల్గొన్నారు.

ప్రయాణికుల వసతులపై ప్రత్యేక దృష్టి

తిరుపతి అర్బన్: రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల వసతులపై ఆయా విభాగాల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ ఆదేశించారు. శుక్రవారం ఆయన రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేశారు. కొళాయిల్లో స్వచ్ఛమైన తాగునీరు రావాలని సూచించారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు. ప్లాట్‌ఫామ్‌ల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలన్నారు. దుకాణాల్లో ఎమ్మార్పీకే వస్తువులు విక్రయించాలని, అధికంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో గంగమ్మ గుడి వరకు భక్తులు బారులు తీరారు. గురువారం అర్ధరాత్రి వరకు 58,855 మంది స్వామివారిని దర్శించుకున్నారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమతోంది. టికెట్లు లేనివారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

వైద్యరంగంలో ఫిజియోథెరపీ పాత్ర కీలకం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ గురుమూర్తి,జేఈఓ సదా భార్గవి, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్

తిరుపతి తుడా: వైద్యరంగంలో ఫిజియోథెరపీ విధానం కీలకంగా మారిందని తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి అన్నారు. స్విమ్స్ శ్రీ పద్మావతి ఆడిటోరియంలో శుక్రవారం ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీ మాట్లాడుతూ జబ్బులు కొన్ని చికిత్సల ద్వారా కాకుండా ఫిజియోథెరపీ చేసుకోవడం వల్ల నయం చేసుకోవచ్చన్నారు. మందుల వాడకం వల్ల కలిగే నష్టాలను సైతం అధిగమించవచ్చని చెప్పారు. టీటీడీ జేఈఓ సదాభార్గవి మాట్లాడుతూ దేహ సమస్యలకు ఫిజియోథెరపీ చక్కటి పరిష్కార మార్గమన్నారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ.కుమార్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో కీళ్ల నొప్పుల సమస్య విపరీతంగా పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎస్వీ వేద విశ్వవిద్యాలయ బీసీ ప్రొఫెసర్ రాని సదాశివమూర్తి, స్విమ్స్ వైద్యాధికారులు డాక్టర్ రామ్, డాక్టర్ జయ చంద్రారెడ్డి, డాక్టర్ వనజాక్షమ్మ డాక్టర్ కే.మాధవి, సిద్ధ హాస్పిటల్ ఇన్‌చార్జ్ డాక్టర్ సామ్రాజ్, డాక్టర్ హర్ష పాల్గొన్నారు.

అక్రమార్జన కోసమే అమరావతి

నారాయణవనం: అక్రమార్జన కోసమే చంద్రబాబు నాయుడు అమరావతిపై ఎక్కడలేని ప్రేమను చూపినట్లు ఐటీ నోటీసుల ద్వారా బహిర్గతమైందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. శుక్రవారం నారాయణవనంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు కంపెనీల నుంచి రూ.118 కోట్ల ముడుపులు తీసుకున్నట్లు ఐటీ నోటీసుల ద్వారా అందరికీ అర్థమైందని వెల్లడించారు. ఇంత జరుగుతున్నా ఎల్లో మీడియాలో ఎలాంటి వార్తలు రాకపోవడాన్ని ప్రజలు గుర్తించారని చెప్పారు. 40 ఏళ్ల ఇండస్ట్రీగా చెప్పుకునే చంద్రబాబు, ఆయన కుమారుడు సొంత ప్రయోజనాల కోసమే అమరావతి జపం చేస్తూ అయిదేళ్ల గడిపారని ఆరోపించారు. అసలు విషయాన్ని పక్కదారి పట్టించేందుకే తండ్రీకొడుకులు రాష్ట్రంలో అలజడులకు కుట్రపన్నుతున్నారని స్పష్టం చేశారు. అందుకు పుంగనూరు, భీమవరంలో జరిగిన ఘటనలే నిదర్శనమని వివరించారు. గతంలో జగనన్న చేపట్టిన మహా పాదయాత్రలో ఎక్కడా ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయలేదని గుర్తుచేశారు. అధికారంలోకి రావడానికి ప్రజల మన్ననలు పొందాలే గాని విధ్వంసాలను సృష్టించడం తగదని హితవు పలికారు. చంద్రబాబు పీఏ శ్రీనివాసులు లెక్కాపత్రాలు లేని రూ. 2వేల కోట్లతో పట్టుబడినట్లు మూడేళ్ల క్రితమే ఐటీ శాఖ పేర్కొందని ఆరోపించారు. సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత అవినీతి పరులైన చంద్రబాబు, లోకేష్‌కు లేదని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారకాయలు, అన్నాదొరై, గురుస్వామి, చిన్నదొరై, వైస్ ఎంపీపీ శివశంకర్, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, సర్పంచులు ధర్మలింగం, మురుగేశం, సుబ్రమణ్యంరెడ్డి, రామ్మూర్తి, స్థానిక నాయకులు మణిరెడ్డి, మోహన్, రమేష్, ఆర్ముగం, అశోక్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

హెచ్ఐవీపై అవగాహన అవసరం




5కే రన్‌ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీహరి

తిరుపతి తుడా: హెచ్ఐవీపై అవగాహన అవసరమని, ఈ మేరకు యువత బాధ్యత తీసుకోవాలనని డీఎంహెచ్‌ఓ శ్రీహరి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో యూత్ ఫెస్ట్ 5కే రెడ్ రన్ మారథాన్ నిర్వహించారు. భారతీయ విద్యాభవన్ నుంచి ఎస్వీ అరవింద్ ఐ హాస్పిటల్ వరకు 5కే రన్‌ను డీఎంహెచ్‌ఓ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత హెచ్ఐవీపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రక్త దాన ఆవశ్యకతను వివరించాలని సూచించారు. అనంతరంరన్‌లో విజేతలకు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సి.అరుణసులోచనాదేవి పాల్గొన్నారు

వైభవంగా వరలక్ష్మీవ్రతం



వ్రతం ఆచరిస్తున్న మహిళలు



విశేషాలంకరణలో చెంగాళమ్మ తల్లి

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలోని ఆస్థాన మండపంలో నిజ శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి వరలక్ష్మీవ్రతం పూజలు వైభవంగా నిర్వహించారు. తొలుత మూలవిరాట్‌కు పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఎదుట వరలక్ష్మీ పూజా సామగ్రి ఉంచి, పూజలు చేసి, ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు. ఆస్థాన మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తిని వరలక్ష్మీదేవిగా అలంకరించి, పూజలు చేశారు. పట్టణంలోని మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, పూజల్లో పాల్గొన్నారు. వేదపండితులు వరలక్ష్మీవ్రత పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళా భక్తులకు, ఇతర భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డీ బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు ఎర్రదొంగల అరెస్ట్

– 33 దుంగలు, రెండు కార్లు స్వాధీనం



పట్టుబడిన దుంగలతోపాటు నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తిరుపతి మంగళం : శేషాచలం అటవీప్రాంతంలోని వేర్వేరు చోట్ల శుక్రవారం నిర్వహించిన దాడుల్లో ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. నిందితుల నుంచి 33 దుంగలు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వివరాలు.. రిజర్వు సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో రెండు టీమ్‌లు గురువారం రాత్రి నుంచి విస్తృత కూంబింగ్ చేపట్టాయి. అందులో ఆర్ఎస్ఐ లింగాధర్ టీమ్ శుక్రవారం అలిపిరి ఫారెస్ట్ బీట్ వద్ద ఓ వాహనంలో ఎర్రచందనం దుంగలను ఎక్కిస్తూ కొందరు కనిపించగా చుట్టుముట్టింది. అన్నమయ్యజిల్లా కేవీ మండలానికి చెందిన ఎస్. ఫయాజ్(23) పట్టుబడగా, మిగిలిన వారు పరారయ్యారు. ఇండిగో కారుతో సహా అందులోని 33ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆర్ఎస్ఐలు వినోద్‌కుమార్, కె. సురేష్‌బాబు రంగంపేట నుంచి మంగళంపేట వైపు తనిఖీలు నిర్వహిస్తుండగా భీమవరం ఫారెస్ట్ బీటు పరిధిలో అనుమానస్పదంగా మహేంద్ర స్కార్పియో ఉందని, అందులో వారిని విచారించగా పొంతనలేని సమాధానం చెప్పడంతో కారులో తనిఖీ చేశారన్నారు. కారులో రెండు పిడిలేని గొడ్డళ్లు కనిపించడంతో ఆ కారులోని ఇద్దరిని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వారు తమిళనాడు తిరపత్తూరు జిల్లా అంబూరు తాలూకాకు చెందిన రామరాజ్ నటరాజన్(35), వానియంబాడి తాలూకాకు చెందిన మోహన్‌వేల్(24)గా గురించి అరెస్ట్ చేశామని డీఎస్పీ వెల్లడించారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో పట్టుబడిన ముగ్గురు స్మగ్లర్లపై ఎస్ఐలు మోహన్‌నాయక్, రఫీలు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు చెప్పారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న టాస్క్‌ఫోర్స్ టీమ్‌లను కర్నూల్ రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్ అభినందించారు.

గడప గడపకు ‘సంక్షేమం’



పేరూరులో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో గడప గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతోందని చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీలో నిర్వహించిన ఆత్మీయ పలకరింపులో తల్లి చెవిరెడ్డి లక్ష్మితో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్ పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. జగనన్న సంక్షేమ పాలనకు దేశవ్యాప్తంగా విశేష ఆదరణ లభిస్తోందని వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లోనూ సంక్షేమ సారథిని ఆదిరించాలని కోరారు. అంతకు ముందు గ్రామదేవత ఆలయంలో విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దామినేటి కేశవులు, ఉప సర్పంచ్ పరంధామరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గోకులాష్టమి వేడుకలు



గ్రామోత్సవంలో కల్యాణ వెంకన్న, శ్రీకృష్ణుడు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం గోకులాష్టమి వేడుకగా నిర్వహించారు. సాయంత్రం యువకులు ఉట్లోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం వేంకటేశ్వరస్వామి, పద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలను చేశారు. 10 గంటలకు తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన శ్రీకృష్ణుడు మాడవీధుల్లో విహరించారు. ఆలయానికి చేరుకున్న గోపాలడికి ప్రత్యేక స్నపన తిరుమంజనం చేసి, దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాలు పూర్తి చేసిన అర్చకులు శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకన్నను, శ్రీకృష్ణుడిగా అలంకరించి, తిరుచ్చిపై కొలువుదీర్చి, మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఉత్సవర్లు సన్నిధివీధిలో పదహారు కాళ్ల మండలంలో కొలువుదీరారు. ఉట్లోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న ఉత్సమూర్తికి ఆస్థానం జరిపారు. టీటీడీ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

తిరుమల: తిరుమల శ్రీవారిని శనివారం సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా దర్శించుకోనున్నారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఆయన తిరుమలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి పుష్పగుచ్ఛంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు దర్శనం ఏర్పాట్లు చేశారు.



సుప్రీంకోర్టు న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న టీటీడీ ఈఓ

కోడి పందెంరాయుళ్ల అరెస్ట్

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని ఆకుతోట వీధి కాలువ గట్టుపై నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై శుక్రవారం సాయంత్రం దాడి చేసినట్లు ఎస్ఈబీ సీఐ ప్రసాద్ తెలిపారు. నలుగురు పందెంరాయుళ్లను అరెస్ట్ చేశామని, రూ.5,060 నగదు, మూడు సెల్ ఫోన్లు, పందెం కోళ్లు, వాటికి కట్టే కత్తులను సైతం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. దాడిలో ఎస్ఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో దారి దోపిడీ

వి.కోట: మండలంలోని నాయకనేరి అటవీ ప్రాంతంలో దారి దోపిడీ ముఠా వృద్ధుడిపై దాడి చేసి రూ.50 వేల దోచుకెళ్లిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు వి.కోట–పేర్నంబట్ మార్గంలోని నాయకనేరి అటవీ ప్రాంతంలో గురువారం రాత్రి తమిళనాడు రాష్ట్రం బత్తరపల్లెకు చెందిన చక్రవర్తి (65) ద్విచక్రవాహనంపై రూ.50 వేలతో వెళుతున్నాడు. సాయంత్రం 7 గంటల సమయంలోనే అదే గ్రామానికి చెందిన కొందరు యువకులు అతనిని వెంబడించి మారణాయుధాలతో దాడి చేసి, అతని వద్ద ఉన్న రూ.50 వేల నగదును లాక్కున్నారు.